



తెలంగాణచౌక్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

● సీపీఎం నిరసన

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను రూ.50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ.50కి పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి ధరలు తగ్గే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాస్, సుంకరీ సంపత్, ఎడ్ల రమేష్, డి.నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల జాడేది..?

- తక్కువ ధరకే మిల్లర్లకు ధాన్యం విక్రయం
- వాతావరణ మార్పులతో రైతుల ఆందోళన



హుజూరాబాద్ మండలం కందుగులలో ఆరబోసిన ధాన్యం

హుజూరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నేల పాలవుతుందని రైతన్నలు వరి కోతలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు విక్రయిస్తున్నారు. పది రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లో 30శాతం వరకు వరికోతలు పూర్తయ్యాయి. మరో రెండు రోజుల్లో 60శాతం వరకు పూర్తి కానున్నాయి. ఈ యాసంగిలో రైతులు నీరు సరిపోవని తక్కువగా సాగు చేశారు. హుజూరాబాద్ డివిజన్‌లో 1.20లక్షల ఎకరాల్లో సాగు భూమి ఉండగా, 80వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద విత్తన వరి సాగు చేశారు. ఈ ధాన్యాన్ని సీడ్ యజమానులు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం నూర్పిడి చేసిన రైతులు కళ్లాల వద్ద ధాన్యాన్ని కుప్పలుగా పోసుకొని కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ ఏ గ్రేడ్‌కు రూ. 2,320, కామన్ రకానికి రూ. 2,300 ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు బయటి వ్యాపారులకు రూ. 2000 లకే విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలని రైతుల ధర్నా



శంకరపట్నంలో ధర్నా చేస్తున్న రైతులు

శంకరపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పంటలకు పూర్తిగా సాగునీరు అందించాలని శంకరపట్నం మండలం కేశవపట్నంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం, కరీంపేట గ్రామాల రైతులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాకతీయ కెనాల్ ద్వారా పంటలకు ఇంకో తడి సాగునీరు అందించాలని కోరారు. పంటలు చివరి దశలో ఉన్నాయని, సాగు నీరు అందక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇంకో తడి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ వాహన సేవ



హనుమత్ వాహనసేవలో స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమత్ వాహనసేవలు ఘనంగా నిర్వహించారు. నిత్యవిధి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించారు.అనంతరం ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై అధిరోహించారు. డప్పు చప్పుళ్ల, మేళాతాళాలు, బాజాభజంత్రీలు, వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య హనుమత్ నామస్మరణ చేస్తూ ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు.

ఆర్టీసీలో సమ్మెకు



- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఆర్టీసీ జేఏసీ
- మే 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటన

కరీంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె సైరన్ మోగనుంది. టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో లేబర్ కమిషన్ కమిషన్ కార్యాలయానికి తరలివెళ్లి సమ్మె తేదీని ప్రకటించారు. మే7వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రీజియన్ లో 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, గోదా వరిఖని, మంథని డిపోలు ఉన్నాయి. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 3,290 మంది ఉద్యోగులు ఉండగా, ఆర్టీసీ సంస్థ బస్సులు 470, ప్రైవేట్ హైర్ ఎలక్ట్రిక్ బస్సులు కలుపుకుని 423 ఉన్నాయి. గత బీఆర్ఎస్ పాలన చివరలో ఆర్టీసీలో సమ్మె ఉధృతంగా కొనసాగింది. చివరి అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించి అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, మెనిఫెస్టో రూపొందించి 16 నెలలుగడుస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఆర్టీసీలో ఒకటి రెండు యూనియన్లు మినహా అన్ని జేఏసీగా ఏర్పడి ఆర్టీసీ

(మిగతా 6వ పేజీలో)

సమస్యలు పరిష్కరించి వేతన సవరణ చేపట్టాలి

ఆర్టీసీ కార్మికుల 2021 వేతన సవ రణ కాలపరిమితి ముగిసిందని, వెంటనే వేతన సవరణ చేపట్టి ఆర్టీసీ కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు. 2017 వే తన సవరణ జరిగినా, నేటికీ ఎరియర్స్ రాకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ ఫిక్సేషన్ చేయకపోవడం, 2017 అలవెన్సులు అమలు చేయకుండా పాత అలవెన్సులనే నేటికీ అమలు చేస్తున్నారని సంఘాలు అంటున్నాయి. బ్రెడ్ విన్నర్ స్కీంలో ఇచ్చే ఉద్యోగాలు కన్సాలిడేటెడ్ విధానంలో కాకుండా రెగ్యులర్ బెసిస్‌లో ఉండాలంటున్నారు. ఒక్కో డ్రైవర్ 500 నుంచి 600 కిలోమీటర్ల మేర బస్సులను నడపడం సాధ్యంకాని పని అంటున్నారు. డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ల టెస్టుల పేరుతో డ్రైవర్లను సస్పెన్షన్‌కు గురి చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. సమ్మె నోటీసులో 21 అంశాలను ప్రస్తావించి సమస్యల పరిష్కారం కోసం సమ్మె అనివార్యమైందని సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

మహిళల భద్రతకు షీ టీం భరోసా 6
• పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం • మహిళలను వేధిస్తున్నవారిపై క్రిమినల్ కేసులు

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం 6
• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

స్మార్ట్ సిటీ @66?



- విలీన గ్రామాలతో కలిపి 66 డివిజన్లు
- డ్రాఫ్టు తయారు చేస్తున్న అధికారులు
- అశాస్త్రీయంగా చేయవద్దంటూ వినతులు
- అభ్యంతరాల స్వీకరణ తర్వాతే తుది రూపం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో అందరి దృష్టి ఎన్నికలపై పడింది. ఇప్పట్లో పాలకవర్గ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని తెలుస్తున్నప్పటికీ కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకుంటున్న వివిధ పార్టీల నాయకులు ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లలో ఏది అనుకూలంగా ఉంటుందో అక్కడ ప్రజలను కలుస్తున్నారు. ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్‌కు ఆనుకొని ఉన్న చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామపంచాయతీలతోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీని కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ 60 డివిజన్లను 66 డివిజన్లకు పెంచడంతో డివిజన్ల స్వరూపంతోపాటు రిజర్వేషన్లు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ కార్పొరేషన్‌లో కొత్తగా విలీనమైన గ్రామాలు, మున్సిపాలిటీతో కలిపి 66 డివిజన్ల డ్రాఫ్ట్ మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. ఇది కేవలం డ్రాఫ్ట్ మాత్రమేనని చెబుతున్నప్పటికీ కొన్ని మాధ్యమాల్లో డివిజన్ల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, కొన్ని డివిజన్లలో 3వేలు, మరికొన్ని డివిజన్లలో 5 వేల నుంచి 6వేల వరకు, ఇంకొన్ని డివిజన్లలో 11 వేల వరకు ఓటర్లు ఉన్నారంటూ డివిజన్ల హద్దులతో ప్రచారం జరుగుతోంది. దీంతో ఔత్సాహిక కార్పొరేటర్ అభ్యర్థులంతా ఇదే ఫైనల్ జాబితా అవుతుందా లేదా అంటూ కంగారుపడుతున్నారు. కొందరైతే డ్రాఫ్ట్ మ్యాప్‌లో పేర్కొన్న డివిజన్ తనకు పూర్తిగా అనుకూలంగా ఉందంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మంది డివిజన్ల విభజన డ్రాఫ్ట్ మ్యాప్ అశాస్త్రీయంగా ఉందంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతమున్న డివిజన్లలోని ప్రధాన రోడ్లను, కాలనీలను బేస్‌చేసుకొని డివిజన్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అలా కాకుండా ఇంటినెంబర్ల ప్రకారంగా చేస్తే డివిజన్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు, సిబ్బందికి కూడా ఇబ్బందులు తప్పవని కొందరు పేర్కొంటున్నారు. రెవెన్యూ డివిజన్ల మాదిరిగా కాకుండా డివిజన్లలో పర్యటించి రోడ్ల ప్రకారంగా కొత్త డివిజన్లను సమానమైన ఓట్లతో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● ఎన్నికలకు మరింత సమయం

గత జనవరి 28న పాలకవర్గ పదవీ కాలం ముగిసింది. 2024 జనవరి 31న గ్రామపంచాయతీలు, జూలైలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. రెండు నెలలకు ముందే మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం ముగియడంతో ఇప్పట్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని తెలుస్తోంది. జూన్, జూలైలో పంచాయతీ లేదా ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయని, వాటి ఫలితాలను బట్టి ప్రభు త్వం మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటు ందనే చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా మరో ఆరు నెలలలోపు మున్సిపల్ ఎన్నికలు జరుగవని అన్ని పార్టీల నాయకులు, అధికారులు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఎలాంటి ప్రకటన కూడా చేయలేదు. ఎన్ని కలు ఎప్పుడు నిర్వహించినా కూడా అందుకు సిద్ధం గా ఉండాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విలీన గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీతో కలిపి 66 డివిజన్ల డ్రాఫ్ట్ మ్యాప్‌ను రూపొందించి సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇది కేవలం డ్రాఫ్ట్ మ్యాప్ మాత్రమే అని తెలిసినప్పటికీ ఇప్పుడే అభ్యంతరాలు తెలుపనట ్లయితే ఇదే ఫైనల్‌చేస్తే తమకు నష్టం జరుగుతుందని భావిస్తున్న వివిధ పార్టీల నాయ కులు, కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్నారు. రోడ్ల ప్రకారంగా డివిజన్ల విభజనచేయాలని కోరుతున్నారు.

డివిజన్ల విభజన శాస్త్రీయ పద్ధతిలో చేయాలి

\- కంసాల శ్రీనివాస్ , మాజీ కార్పొరేటర్

కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీన గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీతో కలిపి 66 డివిజన్ల విభజన ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిసింది. శాస్త్రీయ పద్ధతిలో డివిజన్ల విభజన చేయాలి. ఇటీవల కొన్ని మాధ్యమాలలో డ్రాఫ్ట్ మ్యాప్ తయారు చేశారంటూ ప్రచురితమైన డివిజన్ల నైసర్గిక స్వరూపం పూర్తిగా అశాస్త్రీయంగా ఉంది. రెవెన్యూ డివిజన్లు, ఇంటినెంబర్ల ఆధారంగా అడ్డదిడ్డంగా డివిజన్లు తయారు చేసినట్లు తెలిసింది. ఏన్నో ఏళ్లుగా ఉన్న హద్దులను మార్చుతూ ముఖ్యంగా ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న డివిజన్లను విభజించినట్లు తెలుస్తోంది. ఇలా చేయడం సరికాదని, గల్లీ రోడ్లను కూడా విడదీసి డివిజన్లు చేసినట్లు సమాచారముందని, అలా చేయడం సరికాదు. శాస్త్రీయ పద్ధతిలో రోడ్ల ప్రకారంగా గతంలో చేసిన వాటిని ఆధారం చేసుకొని డివిజన్ల విభజన చేపట్టాలి.

నిబంధనల మేరకే డివిజన్ల విభజన ప్రక్రియ

\- కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

రాష్ట్ర ప్రభుత్వం విలీన గ్రామాలతో కలిపి 66 డివిజన్లను చేసింది. డివిజన్ల విభజన ప్రక్రియపై ఇంకా ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకే డివిజన్ల విభజన జరుగుతుంది. డ్రాఫ్ట్ మ్యాప్‌ను రూపొందించలేదు. అందరి అభిప్రాయాలను సేకరించిన తర్వాత నిబంధనల మేరకే శాస్త్రీయంగా డివిజన్లను చేయడం జరుగుతుంది.

సుస్థిర అభివృద్ధిలో 'తిమ్మాపూర్'కు రెండో స్థానం

● గణాంకాలు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

తిమ్మాపూర్, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించిన పంచాయతీల్లో తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ రాష్ట్రంలోనే రెండవ స్థానం కైవసం చేసుకుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో దేశంలోని గ్రామ పంచాయతీలు 2022-23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు



గణాంకాలను కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసింది. ఇందులో తిమ్మాపూర్ గ్రామ పంచాయతీకి 89.72శాతం మార్కులతో రాష్ట్రంలోనే రెండవ స్థానం దక్కింది. పేదరిక నిర్మూలన, పంచాయతీలలో జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వము, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతులు, సామజిక భద్రత, సుపరిపాలన, లిగ సమానత్వము ఇతర అంశాల అధారంగా 17 రకాల అభివృద్ధి లక్ష్యాలను పంచాయతీల పనితీరులో పరిగణలోకి తీసుకొన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామ పంచాయతీలకు 90-100 మార్కులు సాధిస్తే అచీవర్స్‌గా, 75-90 మార్కులు సాధిస్తే ఫ్రంట్ రన్నర్‌గా, 60-75 మార్కులు సాధించిన గ్రామ పంచాయతీలకు ఫెర్ఫార్మర్‌గా, 40-50 మార్కులు సాధించిన జీపిలకు యాస్పిరెంట్‌గా, 40 మార్కులలోపు సాధించిన జీపీ బిగినర్‌గా విభజించారు. 89.72శాతం మార్కులు సాధించి అచీవర్స్‌గా తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బుర్నాపూర్ 84.09 మార్కులతో మొదటి స్థానంలో ఉన్నది. జిల్లాలో జమ్మికుంట మండలం గండ్రపల్లి80.19 మార్కులతో 11వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా 2022-23లో తిమ్మాపూర్ మండల ఎంపీవోగా విధులు నిర్వహించి ప్రస్తుతం మానకొండూర్ ఎంపీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్, అప్పటి తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, ప్రస్తుతం కరీంనగర్ రూరల్ మండలం చామన్‌పల్లి పంచా యతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న కోరు కంటి మహేందర్ రావును జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డిపిపివో హరికిషన్, హుజురాబాద్ డిపిపివో శ్రీనివాస్, ఎంపివోల సంఘం అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి, ఎంపివోలు ప్రభాకర్, సతీష్‌రావు, బషీరుద్దీన్ పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా మారిన కమాన్ సర్కిల్

మండుతున్న ఎండలు

రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం వేళల్లో జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన ప్రాంతాలు, రహదారులు జనం లేక వెలవెలబోతున్నాయి. ఎండ తీవ్రత పెరుగడంతో ఇళ్లనుంచి బయటికి వచ్చేందుకు జనం జంకుతున్నారు.







ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి పర్యవేక్షణలో బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 66వాహనాల యజమానులకు జరిమానా విధించారు. కరీంనగర్ వన్‌టౌన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనల ప్రకారం నంబర్లు ప్లేట్ లేని వాహనాలతోపాటు, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, శబ్దకాలుష్యం వంటి కారణాలపై వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ భద్రతదృష్ట్యా ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్‌ఎస్సైలు ఉపేంద్రాచారి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గోకుల్‌నగర్‌కు చెందిన గీతకార్మికుడు గర్రెపల్లి వెంకటేష్(49)బుధవారం నూతుల కుంట కరకట్టపై గల తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కల్లుకుండలను దించుతున్న సమయంలో కాలుజారి కిందపడ్డాడు. తోటి గీతకార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏఎల్పీలో ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

రామగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్పీలో బుధవారం మొదటి షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో సర్ఫేస్(బ్లాక్‌స్మిత్) కార్మికుడు మద్ది బీరయ్య గాయపడ్డాడు. ఏఎల్పి ప్రాజెక్టులోని పనిస్థలాల్లో క్రానికల్ అబ్లాంగ్ పనులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో బీరయ్య మోకాలుకు గాయాలయ్యాయి. కార్మికుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



రామయ్య సన్నిధిలో

అఖండజ్యోతి



- 700 ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం
- రాతితో నిర్మించిన కల్యాణ మండపం
- గంభీరావుపేట రామాలయం ప్రత్యేకత
- ఆలయంలో కొనసాగుతున్న బ్రహోత్సవాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) గంభీరావపేట మండల కేంద్రంలోని పురాతన శ్రీ సీతారామాలయంలో వెలిగే అఖండ నంద దీపానికి ప్రత్యేకమైన విశిష్టత. దాదాపు 700 ఏళ్ళుగా ఆరకుండా నంద దీపం వెలుగుతూనే ఉంది. రామాలయాన్ని కాకతీయుల చివరి రాజైన ప్రతాప రుద్రుడు దాదాపు 1333లో నిర్మించినట్లు ఆలయంలోని గంటపై చెక్కన తెలుగు అంకెల ఆధారంగా తెలు స్తోంది. ఆలయంలో మూల విగ్రహ ప్రతిష్ఠకు ముందు అఖండ నంద దీపాన్ని ఏర్పాటు చేయగా, నాటి నుంచి నేటివరకు వెలుగుతునే ఉంది.

ప్రారంభమైన బ్రహోత్సవాలు..

శ్రీసీతారామాలయంలో శ్రీరామనవమి నుంచి స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణం మొదలుకొని తొమ్మిది రోజులు పాటు బ్రహోత్సవాలు వైభవంగా సాగుతాయి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా స్వామి వారి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. స్వామివారిని అశ్వ, గజ, హనుమ, పొన్న, గరుడ సేవలపై ఊరేగిస్తారు. చివరి రోజున స్వామి వారు రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారు.

16 స్తంభాలతో కల్యాణ మండపం

శ్రీ సీతారామాలయంలో 16 స్తంభాలతో కూడిన కల్యాణ మండపం అత్యంత సుంద రంగా రాతితో నిర్మించారు. ఏటా భద్రాచలంలో జరిగే విధంగా అదే సమయంలో రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్స వాన్ని నిర్వహిస్తారు. కోరిన వారికి కోర్కెలను తీరుస్తాడని శ్రీ రామచంద్ర మూర్తిపై ఇక్కడి ప్రజలకు ప్రగాఢ విశ్వాసం.

భక్తుల కొంగు బంగారం..

మల్లుగారి నర్సాగౌడ్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్

గంభీరావుపేట పురాతన రామాలయంలోని శ్రీరామచంద్రమూర్తి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరజిల్లుతున్నారు. రామాలయానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. సంతానం లేని వారు భక్తిశ్రద్ధలతో కొలిస్తే తప్పకుండా స్వామి అనుగ్రహం ఉంటుంది. ప్రతీ ఏటా శ్రీరామ నవమి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.





రాతి కట్టడాలతో నిర్మించిన 16 స్తంభాల కల్యాణ మండపం

బావిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన సంగెపు మహేష్ (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన మృతుడు మహేష్ ఉపాధి నిమిత్తం ముంబైలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడు 10 సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 7న తమ బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండడంతో జగదేవ్‌పేట గ్రామానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సంగెపు మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాణినగర్‌కు చెందిన ఆరుముల్ల గంగారాం తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. దొంగలు వాహనాన్ని బుధవారం అపహరించుక వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలోపడి చిన్నారి మృతి



గడ్డం జశ్విత(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట గ్రామంలో చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలో పడి మృతిచెందింది. పోలీసులు, చిన్నారి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నవివరాల ప్రకారం.. పెద్దపల్లిజిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన గడ్డం అజేందర్‌రెడ్డి కూతురు జశ్విత(3)ను మూడు రోజుల కిందట బహదూర్‌ఖాన్‌పేటలోని పెద్దమ్మ, పెద్దనాన్నలు వారి ఇంటికి తీసుకెళ్లారు. గురువారం జశ్వితతోపాటు ఆమె పెద్దమ్మ, పెద్ద నాన్న, వారి కొడుకు అభిరాంరెడ్డి పొలం వద్దకు వెళ్లారు. చింతచెట్టు కొట్టేందుకు పనివాళ్లు రాగా అక్కడే ఉన్న ట్రాక్టర్‌ను అభిరాంరెడ్డి పక్కకు తీసుకెళ్లి వ్యవసాయబావివద్ద నిలిపాడు. ఆసమయంలో అభిరాంరెడ్డితో పాటు జశ్విత కూడా డ్రైవర్ సీటు పక్కనే కూర్చుంది. ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్‌చేసిన అభిరాంరెడ్డి తాళంచెవి దానికే ఉంచి కిందకు దిగాడు. జశ్విత ఆ తాళంచెవితో ట్రాక్టర్‌ను ఆన్ చేసింది. దీంతో గేర్‌లో ఉన్న ట్రాక్టర్ పక్కనేఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌తోపాటు జశ్విత కూడా బావిలో పడింది. వెంటనే ఆమెను బయటకు తీసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జశ్విత మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. అభిరాంరెడ్డి నిర్లక్ష్యంగా తాళం చెవి ట్రాక్టర్‌కు వదిలివెళ్లి ప్రమాదానికి కారణమయ్యాడని చిన్నారి తండ్రి గడ్డం అజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపుంజును పట్టుకునేందుకు వెళ్లి.. వ్యవసాయ బావిలో పడి మృతి



రాజేశం (ఫైల్)

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లె గ్రామానికిచెందిన నామని రాజేశం(70)అనేవ్యక్తి బుధవారం కోడి పుంజును పట్టుకునే క్రమంలో వ్యవసాయబావిలో పడి మృతిచెందాడు. వివరాలు ఇలాఉన్నాయి. వరిపంట కోతలు ప్రారం భించడానికి సంప్రదాయంలో భాగంగా పోతలింగన్న గుడివద్ద కోడి పుంజును కోస్తారు. కోడిపుంజును కొనుక్కొని సంచిలో పెట్టుకొని రాజేశం గుడి వద్దకు వెళ్లాడు. సంచిలో నుంచి కోడిపుంజును బయటకు తీయగా ఒక్కసారిగా ఎగిరిపోయిన వ్యవసాయ బావిలో పడింది. దానిని పట్టుకునే క్రమంలో రాజేశం ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడ్డాడు. ఆ సమయంలో ఆప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో రాజేశం బావిలోనే మృతిచెందాడు. పొలంవద్దకు వెళ్ళిన రాజేశం తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పొలంవద్దకు వెళ్ళి పరిశీలించగా బావిలో పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అఫ్రోజ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడగా, ఈనెల 7న ఒకరు మృతిచెందగా, మరొకరు బుధ వారం మృతిచెందారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మరణించడంతో రెండు కుటుంబాల్లో విషాదాన్ని నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని మౌలాని-రఫీక్ దంపతుల చిన్న కొడుకు అఫ్రోజ్(20) ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. రంజాన్ పండుగకు అదే గ్రామంలోని తన చిన్నమ్మ కొడుకు ఆవేజ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు బయలుదేరారు. హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సిరిసిల్ల నుంచి వస్తున్న ఆటో, అటు వైపునకు వెళుతున్న యువకుల బైక్‌లు ఢీకొన్నాయి. అవేజ్, అఫ్రోజ్‌లతో పాటు ఆటో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆవేజ్, అఫ్రోజ్‌ల పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఈనెల 7న ఆవేజ్ చనిపోయాడు. మరో యువకుడు అఫ్రోజ్ బుధ వారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు మౌలానీ, రఫీక్, సోదరులు అబ్బాస్, అబ్దుల్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇరుక్కుపోయిన డ్రైవర్
- గంటపాటు శ్రమించి బయటికి తీసిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి హైదారాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వె స్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఒక ప్రయాణికురాలికి గాయాలు కాగా హార్వెస్టర్ డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో రాజీవ్‌రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన శ్రీనుకి చెందిన హార్వెస్టర్ గంగాధరలో పనుల నిమిత్తం మంగళవారం రాత్రి బయలుదేరి వెళుతోంది. ఈ క్రమంలో హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. దీంతో హార్వెస్టర్ పల్టీకొట్టుకుంటూ రోడ్డు మధ్యలో ఉన్నడివైడర్ పైనుంచి హైదారాబాద్ వైపు రాజీవ్ రహదారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్ డ్రైవర్ పంజాబ్‌కు చెందిన కౌశల్ సింగ్ అందులోనే ఇరుక్కుపోగా అందులోనే ఉన్న మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు, బ్లూకోట్స్ సిబ్బంది గంట సేపు కష్టపడి హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్‌సింగ్‌ను బయటకు తీశారు. కౌశల్‌సింగ్ కాలు విరగగా, బస్సులో ప్రయాణిస్తున్న మల్యాలకు చెందిన అంజలికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 50మంది వరకు ఉన్నారు. బస్సు ముందు భాగం మొత్తం ధ్వంసం అయింది. క్షతగాత్రులను 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్ సింగ్

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం/వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడిసెలపేట గ్రామానికి చెందిన రెబ్బస్ పోచయ్యకు గట్టయ్య, లచ్చయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తన ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇవ్వగా గట్టయ్య వాటాను లచ్చయ్య కొనుగోలు చేశాడు. అప్పటినుండి పోచయ్య తన భార్యతో కలిసి పెద్దకుమారుడు లచ్చయ్య ఇంటిలో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కుమారుడు లచ్చయ్యకు, తండ్రిపోచయ్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తనఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ 2022ఏప్రిల్ 1న మరోసారి ఇద్దరిమధ్య గొడవజరగగా కర్రతో తండ్రిని లచ్చయ్య విచక్షణారహితంగా చితకబాదాడు. తీవ్రగాయాలైన పోచయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేయగా సీఐ కోటేశ్వర్, ఎస్సై నరేష్‌లు కేసును విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటి అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు.

నేరం రుజువు కావడంతో ముద్దాయి లచ్చయ్యకు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నరైతులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోయి బోరు బావులు ఎండిపోతున్నాయి.. నీళ్ల లేక తల్లడిల్లుతున్నాం.. తమ గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తీస్తే ఊరుకోబోమంటూ ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఇసుకను రవాణా చేసేందుకు వాగు వద్దకు చేరుకున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. వేరే గ్రామాల వారు వాగు నుంచి తరలిస్తే తమ పంట పొలాలు ఎండిపోతాయని వాపోయారు. సమాచారం అందుకున్న తహసీల్ అధికారులు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి యత్నించిన ఫలితం లేకుండాపోయింది. చేసేదేమీ లేక ట్రాక్టరు డ్రైవర్లు అక్కడ నుంచి వెనుదిరిగారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ధర్మపురి/శంకరపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల ఒకవాగులో పడి శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు మల్లమ్మ(89) అనే వృద్ధురాలు మృతి చెందింది. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమ్మె వేతనాలు ఇవ్వాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమ్మెకాలం వేతనాలు, వేసవిసెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరుణాకుమారి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరుణాకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీటీచర్స్, హెల్పర్స్‌కు రిటైర్మెంట్‌బెనిఫిట్స్, సమ్మెకాలం వేతనాలు, పీఆర్‌సీ 30శాతం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను రెండవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కనీసవేతనాల జీవోను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18లు నెలకు ఇవ్వాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అంతిమ సంస్కారాలకు టీచర్లకు రూ. 20 వేలు, హెల్పర్‌కు రూ. 10వేలు సౌకర్యం కల్పించాలన్నారు ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ టీచర్ హెల్పర్‌కు కనీసం నెలకుపెన్షన్ రూ.3వేలుఇవ్వాలన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ఆన్‌లైన్‌లో విడివిడిగా ఆన్‌లైన్ చేయడం పని భారంగా మారిందని పని భారం తగ్గించాలని అన్నారు. ఆ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ, గౌరవ అధ్యక్షుడు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులక్రితం ఆత్మహత్యహత్నాయత్నం చేసిన వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లిమండలం గొడిశెలపేట గ్రామానికిచెందిన అల్లె లచ్చయ్య (58) అనేవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సైఉమాసాగర్ కథనం ప్రకారం.. లచ్చయ్య కూలిపనిచేసు కుంటూ జీవిస్తున్నాడు. అతడు 15సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధప డుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఈనెల7న గడ్డిమందు సేవించి ఆత్మహత్యా యత్నం చేశాడు. జగిత్యాలలో చికిత్స పొందుతూ పరిస్థితివిషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుని భార్య అల్లెవిజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చెరాల లింగయ్య(78) అనే వృద్ధుడు పరుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లింగయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులుచూసి అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు లింగయ్యను 108లో హుజూరాబాద్ ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

తనతండ్రి అనారోగ్యానికి గురి కావడం, ఒంటరితనం భరించలేక పురుగుల మందుతాగి ఆత్యహత్య చేసుకొని ఉంటాడని మృతుడి కొడుకు చెరాల మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

కోరుట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (22) అనే వివాహిత ఆత్మహత్యకు కుటుంబ కలహాలు, భర్త వేధింపులే కారణమనే తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రంజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండు రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రంజిత తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంజిత గత సంవత్సరం అక్టోబర్‌లో పవన్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. రంజిత, పవన్ దంపతులు అయ్యప్ప గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. పవన్ మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బుల విషయంలో తన కూతురుతో గొడవ పడడంతో పాటు అతడి కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేసే వారిని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండానే పనులు ప్రారంభిస్తారా?

- పనులను అడ్డుకున్న భూయజమానులు

వేములవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండానే తమ సొంత భూముల్లో ప్రభుత్వ పనులు ఎలా ప్రారంభిస్తారని యజమానులు అధికారులు ప్రశ్నించారు. వేములవాడపట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి డ్రైనేజీద్వారా వస్తున్న మురుగునీరు గుడిచెరువులో కలవకుండా మళ్లించేందుకు దాదాపు మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు బుధవారం పనులు ప్రారంభించగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తమ అనుమతి లేకుండానే పనులు ఎలా ప్రారంభిస్తారు అంటూ సంబంధిత భూయజమానులు అడ్డుకున్నారు. అధికారికంగా సమాచారం ఇచ్చి, తగిన పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేపట్టాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ అన్వేష్ మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్ భూములలోనే పనులు చేస్తున్నామని, పనులు ఆపబోమని స్పష్టం చేశారు. భూ యజమానులు లాలనర్సింగం, ఫసియుద్దీన్, రామారావు, ఈర్లపల్లి రాజు, శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.



అధికారులను ప్రశ్నిస్తున్న భూ యజమానులు

బేకరీకి రూ.20 వేల జరిమానా

కోల్‌సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ప్రజారోగ్యవిభాగం సిబ్బంది బుధవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని సిరికేక్స్ అండ్ మోర్‌లో తనిఖీలు జరిపింది. ఈ తనిఖీల్లో కేకుల తయారీలో వినియోగించే రసాయనాలు కాలం చెల్లినవిగా గుర్తించారు. వీటితో పాటు మరికొన్ని కాలం చెల్లిన పదార్థాలను సీజ్ చేశారు. షాపు నిర్వాహకులకు రూ.20వేల జరిమానా విధించారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



బేకరీ నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న కార్పొరేషన్ అధికారులు

డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ సమీక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి.రాజు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపోల్లో ఆపరేషన్స్, మెకానికల్ విభాగాల పనితీరు, డిపోల ఆర్థిక పరిస్థితిపై సమీక్షించారు. వేసవిలో బస్ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. మహాలక్ష్మి పథకం రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు వెంకటేశ్వర్‌రావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పని చేసిన సర్పంచులపై పాలకుల వివక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసిన సర్పంచులపై పాలకులు వివక్ష చూపిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, గ్రామ పంచాయతీల పురోగతిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆరు గ్రామాలు ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 25 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధిస్తే వాటిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే తిమ్మాపూర్ (కరీంనగర్)బండపల్లి (చందుర్తి మండలం), గంగ్రపల్లి (జమ్మికుంట), బల్వంతాపూర్ (మల్యాల), రుద్రంగి, ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలు మెరుగైన ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా పంచాయతీల్లో కీలకంగా పనిచేసిన నాటి సర్పంచులు, అధికారులకు అభినందనలు తెలిపారు. కష్టపడి పనిచేసిన మాజీ సర్పంచులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపడం సహించరాని విషయమని తెలిపారు. ప్రజల కోసం అప్పులు చేసి ఆస్తులు అమ్మి పంచాయతీలను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.ఇకనైనా మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించాలన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందికి ఆన్‌లైన్ ఎల్‌సీపై శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఆన్‌లైన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్‌ను ప్రవేశపెడుతున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్ బాబు తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. 11కెవి, ఎల్‌సి మొబైల్ యాప్ మీద ట్రైనింగ్‌లో భాగంగా టౌన్ వన్ సబ్ డివిజన్ టౌన్‌టు సబ్ డివిజన్ అలుగునూరు సబ్ డివిజన్ ఏఈలకు, సిబ్బందికి, సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సమాచారలోపం ఇతర కారణాలతో ఎల్‌సీ తీసుకున్నపుడు చాలా తప్పులు జరుగుతున్నాయన్నారు. ఈ యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.

కొండగట్టులో హనుమాన్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు



- రేపటి నుంచి ప్రారంభం
- అంజన్నను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు
- 12న చిన్న హన్‌మాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్నహనుమాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే ఈ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపుగా మూడు లక్షలకుపైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. జయంత్యుత్సవాలకు 41 రోజుల ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా మాల విరమణ చేస్తారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పుతూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు, ఇతరత్రా ఏర్పాట్లును అధికారులు చేస్తున్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతుండగా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతాయి. ప్రతి ఏటా చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41 రోజులకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హనుమాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హనుమాన్ దీక్షపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు గాను దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. శనివారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరగనుంది. ఇందుకుగాను రెండు రోజులుగా దీక్షాపరులు కొండగట్టుకు రావడంతో సందడి నెలకొంది.

ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగే జయంత్యుత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు లైటింగ్, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి 13వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. 14 కౌంటర్లు ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల ప్రసాదాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయ ప్రాంగణంలో 64 సీసీ కెమెరాలు ఉండగా అదనంగా 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లన్నారు. 6 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కొండపైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను పెంచాలన్నారు. కల్యాణ కట్ట వద్ద ఎక్కువ మంది నాయీ బ్రాహ్మణులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక కుమార్, ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, కలెక్టరేట్ ఏవో హకీం పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్రలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 9: ఈ నెల 12వ తేదీ శనివారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వివిధ పుణ్య క్షేత్రాలకు పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పలువురు ఆంజనేయస్వామి దీక్షాపరులు బుధవారం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తూ నగరానికి చేరుకున్నారు. మొత్తం 250 కి.మీ ప్రయాణం ప్రారంభించినట్లు, వేములవాడ, కొండగట్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. మే 22న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు విజయవాడ, భద్రాద్రి, యాదాద్రి, ఇల్లందకుంట, వేములవాడ, కొండగట్టు, అగ్రహారం, ధర్మపురి, కాళేశ్వరం, తిరుమల జాపాలి తదితర ప్రాంతాలకు తరలి వెళ్లనున్నారు.


పాదయాత్రగా వెళుతున్న దీక్షాపరులు




మాట్లాడుతున్న జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్, కొండగట్టులో ప్రవేశద్వారం వద్ద స్వాగత తోరణాలు, లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

రేపు సిరిసిల్ల జిల్లాకు నలుగురు మంత్రుల రాక..

- అపెరల్ పార్కులో టెక్స్‌పోర్ట్ యూనిట్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


టెక్స్‌పోర్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఈనెల 11న నలుగురు మంత్రులు రానున్నారు. అపెరల్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన టెక్స్‌పోర్టు యూనిట్‌ను పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. టెక్స్‌పోర్టు యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల డీటీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు ఉన్నారు.

మానేరు వాగులో చెక్ డ్యాంను పునర్‌నిర్మించాలి..

పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణ శివారులో మానేరు వ్యాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను ఈఎన్‌సీ శంకర్‌తో కలిసి పరిశీలించారు. పునర్నిర్మాణ పనులను చేపట్టాలని మానేరు బ్రిడ్జి నుంచి మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పునర్ నిర్మించాలని అన్నారు. ఆయన వెంట ఈఈలు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

పోలీసులు అంకిత భావంతో పనిచేయాలి

డీఐజీ సన్నీ


గదులను ప్రారంభిస్తున్న డీఐజీ సన్నీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసలు అంకిత భావంతో పనిచేయాలని డీఐజీ సన్నీ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో నిర్మించిన ఆయుధ కారాగారాన్ని బుధవారం వర్చువల్ పద్ధతి ద్వారా అడిషన్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్ హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. అలాగే బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ సన్నీ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన దోబీ, బార్బర్ రూంలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఐజీ సన్నీ మాట్లాడుతూ బెటాలియన్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులను నిర్వహించాలని సూచించారు. బెటాలియన్ అభివృద్ధిలో సిబ్బంది ముఖ్య ప్రాత పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 12న జాతర
- క్యూలైన్లు, హోమశాల ఏర్పాటు


ముస్తాబైన ఆలయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం చిన్న కలువల గ్రామంలో వెలిసిన మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిగా పిలువబడుతున్న మహమ్మాయి ఆలయ బ్రహ్మోత్సవాలు యేటా అంగరంగ వైభవంగా జరుగుతాయి. విశ్వకర్మలు, విశ్వబ్రాహ్మణ అనుబంధ కులస్థుల ఆరాధ్య దైవం. మహమ్మాయి దేవాలయం హుస్సేనిమియావాగు ఒడ్డున ఉంది. ఇక్కడ అమ్మ వారు స్వయంభూగా వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ముంబాయిలో మొదటి శక్తిపీఠం ఉండగా రెండోది చిన్న కలువల మహమ్మాయి అమ్మవారి ఆలయంగా పరిగణి స్తున్నారు. శాతవాహనుల కాలం నాటి ఆలయం ఇది. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వస్తారు. ఉమా మహేశ్వర కల్యాణంతోపాటు అర్చనలు, అభిషేకాలు,కుంకుమ పూజలు నిత్య హోమాలు నిర్వహిస్తారు. వారం రోజులు సాగే పూజలలో నిత్యాన్న దానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్తలు తెలిపారు.


అమ్మవారు

భక్తులకు సౌకర్యాలు కల్పించాం

దేవరకొండ కృష్ణామాచార్యులు, బ్రహ్మోత్సవ నిర్వాహకులు

ఈ నెల 12 వరకు కొనసాగే మహమ్మాయి దేవి ఆలయ బ్రహ్మోత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశాం. చల్లని తాగునీరు, వారం రోజుల పాటు అన్న దానం ఏర్పాట్లు చేశాం. కరీంనగర్ సుల్తానాబాద్ వైపు నుంచి వచ్చే వారు తమ వాహనాలు చిన్నకలువల ఊరిలోపలి నుంచి దేవాలయం వరకు రావచ్చు. గోదావరిఖని, రామగుండం, మంథని, మంచిర్యాల వైపు నుంచి వచ్చే వారు పెద్దకలువల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క నుంచి కాలువ మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు.


అన్నదానం కోసం నిర్మించిన షెడ్డు

రైతుల కోసం ఏఐ క్రాప్ కేర్ యాప్

- వ్యవసాయంలో నష్టం రాకుండా యాప్‌ను రూపొందించిన జ్యోతిష్మతి విద్యార్థులు
- అమెరికాలో ఇంటర్న్‌షిప్ కోసం ఆహ్వానం


పంటల పైన చేస్తున్న పరిశోధనలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి, రైతుల కష్టాలు చూసిన వారు.. ఎలాగైనా రైతులకు మేలు చేసే విధంగా తమ వంతు ఏదైనా చేసి చూపించాలనే దృఢ సంకల్పంలో ఓ యాప్‌ను రూపొందించారు. అంతే కాకుండా దానిపై పరిశోధనలు చేసేందుకు అమెరికాకు వెళ్లేందుకు అవకాశాన్ని దక్కించుకున్నారు. స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో సీఎస్‌ఈ- 4వ సంవత్సరం చదువుతున్న అజిత్, సీఎస్‌ఎం 4వ సంవత్సరం చదువుతున్న అక్షిత్, సీఎస్‌ఈ 4వ సంవత్సరం చదువుతున్న రమేష్ కలిసి కలిసి ఒక టీంగా ఏర్పడ్డారు. రైతులు పండించే పంటలపై పరిశోధనలు నిర్వహించారు. ఇందుకోసం క్రాప్ కేర్ యాప్‌ను రూపొందించారు.

- **యాప్ ఉపయోగం:** భారతదేశ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వ్యాధులను గుర్తించేందుకు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు విద్యార్థులు ప్రాజెక్టు ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరికరాన్ని రూపొందించారు. ఈ ఏఐ ఆధారిత క్రాప్‌కేర్ యాప్‌లో ముందుగా రైతులు తమ పంటకు సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ పంటకు ఏమైనా వ్యాధి సోకిందా, దానిని ఏ విధంగా తగ్గించవచ్చు అనేది సూచిస్తుంది. పంట పండించక ముందే మార్కెట్‌లో ఎంత ధర ఉండే అవకాశం ఉంది, అసలు ఏఏ పంటలు పండిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందనేది ముందుగానే యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. సీజన్‌ను బట్టి ఏ పంటలు వేస్తే బాగుంటుందనేది కూడా యాప్ తెలియజేస్తుంది. రైతులు నష్టాల బారిన పడకుండా ముందస్తుగా ఒక అవగాహనకు వచ్చేందుకు ఈ యాప్ దోహదపడుతుంది.

ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది

జువ్వాడి సాగర్‌రావు, చైర్మన్, జ్యోతిష్మతి విద్యా సంస్థలు



తమ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునాతన ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని అమెరికాలో నిర్వహించే పరిశోధనలో పాల్గొనేందుకు తమ విద్యార్థులు ఎంపికకావడం సంతోషంగా ఉంది. ఇలాంటివి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. విద్యార్థుల పరిశోధనలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాం.



క్రాప్ కేర్ యాప్ రైతులకు ఎంతో మేలు

అజిత్, అక్షిత్, రమేష్, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల

రైతుల కోసం ఏఐ ఆధారిత క్రాప్ కేర్ యాప్ రూపొందించడం చాలా సంతోషంగా ఉంది. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుంది. ఒక్క పంట ఫొటోతో మొత్తం పంటకు సంబంధించిన వివరాలు యాప్ తెలుస్తాయి. ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి. ఏఏ పంటలు వేస్తే లాభాలు ఉంటాయి. మద్దతు ధరతో సహా అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. రైతులకు ఈ యాప్ సహాయకారిగా ఉంటుంది.

అఖిల భారత హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


పులి మాధవి, అనుపురం సాయికృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ నెల 7 ప్రారంభమైన అఖిల భారత పోలీస్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన పులి మాధవి, అనుపురం సాయికృష్ణ ఎంపికయ్యారు. రామడుగుకు చెందిన అనుపురం సయికృష్ణ మంచిర్యాల 13వ బెటాలియన్ నుంచి, కురుమపల్లికి చెందిన పులి మాధవి రామగుండం కమిషనరేట్ నుంచి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, పెటాటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పీడీలు అభినందించారు.

ఆరుబయట వంట.. తప్పని తంటా..

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని వంట గదులు
- మధ్యాహ్న భోజనం నిర్వాహకుల ఇబ్బందులు


వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం, నిలువ చేసిన టమాటాలు, గుడ్లు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, గుండారం, అక్కపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసేందుకు సరైన వంట గదులు లేవు. దీంతో నిర్వాహకులు ఆరు బయట చేయాల్సి వస్తోంది. ఇరుకుగా ఉన్న వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం ఏర్పాటు, అందులోనే కూరగాయాలు, ఇతర సామగ్రి నిల్వ చేయడం వల్ల వంట తయారుకు స్థలం లేకుండాపోతోంది. దాంతో వంట నిర్వాహకులు ఆరుబయట చెట్లు, అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల స్లాబ్‌ల కింద భోజనం తయారుచేస్తున్నారు. వంట చేసేందుకు ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను అందించకపోవడం వల్ల కట్టెల పొయ్యిపై వండాల్సి వస్తోంది. దాంతో తీవ్రమైన పొగ తరగతి గదుల్లోకి చేరుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్వాహకులు మంట సెగను తట్టుకోలేకపోతున్నారు. వాన కాలంలో పరిస్థితి మరింతా దారుణంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వంట గదులను నిర్మించడంతో పాటు గ్యాస్ సిలిండర్లను అందించాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న తరగతి గది స్లాబ్ కింద వంట చేస్తున్న నిర్వాహకురాలు

● న్యూస్‌బాక్స్

నేడు మాంసం విక్రయించరాదు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా గురువారం నగరపాలక సంస్థ పరిధిలో మాంసం విక్రయించరాదని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మేకలు, గొర్రెలు, ఎద్దుల వధశాలలను నిర్వహించకూడదని, ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'ముద్దసాని' సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, దివంగత నేత ముద్దసాని దామోదర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు కొనియాడారు. దామోదర్‌రెడ్డి 13వ వర్థంతి సందర్భంగా నగరంలో సమాఖ్య ఆధ్వర్యంలో దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్‌రెడ్డి మంత్రిగా జిల్లా అభివృద్ధికి, ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ అనుబంధ కళాశాలల సమన్వయంతో నిర్వహించనున్న కార్యక్రమాల కర పత్రాన్ని బుధవారం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తీ రవికుమార్ ఆవిష్కరించారు. బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతి బాపూలే, అంబేద్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా ఈ నెల 11వ తేదీ నుంచి 14 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కరీంనగర్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని భగత్ నగర్‌లో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. హాజరు రిజిస్టర్ పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీసీపీవో పర్వీన్ ఉన్నారు.

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, భారీవర్షాల ప్రభావంతో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాలతోపాటు స్టేవైరు/సపోర్టు వైరు, తడిసిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదని పేర్కొన్నారు.

క్యాంపస్ టు కార్పొరేట్ శిక్షణ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో క్యాంపస్ టు కార్పొరేట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాలతి తదితరుఉల పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్/రామడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సన్నబియ్యం సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారులు కడపల లచ్చమ్మ-రాజయ్య ఇంట్లో బుధవారం సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ కొద్ది రోజులేననే ఆరోపణల్లో నిజం లేదని, ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం ఇవ్వడం లేదన్నారు. రేషన్‌కార్డు లేని వారు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, వైస్ చైర్మన్ సత్యం, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జ్యోతినగర్‌లోని సన్న బియ్యం లబ్ధిదారులు బోనాల భారతి-శంకర్ ఇంట్లో బుధవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. మహిళా సమైక్య అధ్యక్షురాలు పెద్దిగారి పద్మ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


భోజనం చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

అంజనీదేవి కవిత్వానికి అనంత శక్తి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జీవీ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 9: కవయిత్రి బిట్ల అంజనీదేవి కవిత్వానికి అనంత శక్తి ఉందని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం ఫిలింభవన్‌లో అంజనీదేవి రచించిన 'మనసెందుకో సున్నితం' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. అంజనీదేవి నుంచి ఇంకా మంచి కవిత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వినియోగ దారుల వివాదాల పరిష్కార సంస్థ చైర్ పర్సన్ శ్రీలత, బండారి రాజ్‌కుమార్, సంస్థ అధ్యక్షుడు సీవీ కుమార్, కార్యదర్శి శంకరయ్య, దేవేందర్, పీఎస్ రవీంద్ర పాల్గొన్నారు.

సంఘం ఆదాయ వనరులు పెంచేందుకు కృషి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ఆదాయ వనరులు పెంచేందుకు కృషి చేస్తామని దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ తోట తిరుపతి అన్నారు. గురువారం దుర్శేడ్‌లోని సంఘం ఆవరణలో సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సహకార సంఘం కార్యదర్శి నేతి వేణు వార్షిక నివేదికను వినిపించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు గొనె నర్సయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణబిల్లును రద్దు చేయాలని టీపీసీసీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ సైఫ్ ఉల్లా ఖాలీద్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు వక్ఫ్ సంస్థను బలహీనపరిచే విధంగా ఉందన్నారు. ఈ నెల 13న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై నిర్వహించే మిలియన్ మార్చ్‌కు అన్ని వర్గాల ప్రజలు హాజరుకానున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న బీజేపీ

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) 54వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఎన్‌ఎస్‌యూఐ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు ఇందిరాచౌక్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి బైక్ ర్యాలీ చేపట్టారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు తేజస్, రాష్ట్ర నాయకుడు సుమంత్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లౌడ్ బ్రిడ్జ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్యోతినగర్‌లో ఏర్పాటు చేసిన క్లౌడ్‌బ్రిడ్జ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కార్యాలయాన్ని బుధవారం మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ కోర్సు, వెబ్ అండ్ యాప్ డెవలప్‌మెంట్, పైతన్, జావ ఫుల్‌స్టాక్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ కోర్సులను ఇక్కడ అందుబాటులోకి తెచ్చామన్నారు. మాజీ కార్పొరేటర్ రాపర్తి విజయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా గురువారం విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు బోయివాడ, గంజ్, సిక్‌వాడీ, మార్కెట్ ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్ శాస్త్రిరోడ్డు, 9:30 గంటల నుంచి 11:30 వరకు కిసాన్ నగర్, ప్రవిష్ట ఏరియా, అర్బన్ హెల్త్ సెంటర్, కాన్‌పురా రోడ్ నంబరు 6టు11, హుసేన్‌పురా రోడ్ నంబరు 9, దుర్గమ్మగడ్డ, రజ్వీచమాన్, బొమ్మకల్ బైపాస్, సిటిజన్‌కాలనీ, విజయలక్ష్మి కాలనీ, సిరిపురం కాలనీ, మారుతినగర్, పాతబజార్, వెంకట సాయి రోడ్డు, కాపువాడ, అశోక్‌నగర్, గౌరిశంకర్ కాంప్లెక్స్ హైమద్ పురా, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు గణేష్‌నగర్ బైపాస్ ఏరియా, తిరుమల థియేటర్, వసంత్‌వాలీ స్కూల్, ధ్రువాసి కార్ఖానా ఏరియా, నారదాసు లక్ష్మణ్‌రావు నివాసం సమీపంలో, జెప్టో ప్రాంతం, 9గంటల నుంచి 11, ముఖరంపురలోని సబ్ స్టేషన్ 41 ఏరియా,ఉదయం 9 గంటల నుంచి 11 వరకు నగునూర్, ప్రతిమాహాస్పిటల్ ఏరియాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డెక్స్‌టర్ ఆక్సిస్ టెస్ట్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నాగ్‌పూర్ ఎన్‌ఐటీలో ఇటీవల నిర్వహించిన డెక్స్‌టర్ ఆక్సిస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పారమితలో 7,8,9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సారా సర్వరాజ్, లింగాల హర్షిత్, కందుకూరి రిషిత రెండో రౌండ్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు అభినందించారు.

ఆర్టీసీలో సమ్మెకు సై

(3వ పేజీ తరువాయి)

సమ్మెకు శంఖారావం పూరించారు. జనవరి 27వ తేదీ సమ్మె నోటీసు అందించారు. యాజమాన్యం, ప్రభుత్వం, లేబర్ కమిషన్ నుంచి స్పందన రాక పోవడంతో ఈ నెల7న చలో లేబర్ కమిషన్ కార్యాలయం చేపట్టారు. మే7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు.

● ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకం

- ఎం థామస్‌రెడ్డి, జేఏసీ వైస్ చైర్మన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్



ప్రభుత్వాలు, సంస్థ చర్యలతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేస్తామని అసెంబ్లీలో ప్రకటించింది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో విలీనం అంశం ఉన్నా ఆర్టీసీ ఉద్యోగులను పట్టించుకోవడం లేదు. ఈవీ బస్సులను తీసుకొచ్చి డిపోలన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ పరం చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మల్లేశం గౌడ్, ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ



ఆర్టీసీలోని సంఘాలన్నింటినీ కలుపుకొ ముందుకెళ్లాలి. సమ్మెపై సీఎం, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలి. సమస్యలు పరిష్కరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు 21 శాతం పీఆర్సీ అందించింది. 2017 ఎరియర్స్, డీఏలు, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన అంశం, యూనియన్ల ఎన్నికలు, పేస్కేల్ బకాయిలు అందించాలి.

ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థికి 3వ ర్యాంకు


అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థి శివేన్‌రెడ్డి ఆల్ ఇండియా 3వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.

కవితా సంపుటి, ఆంగ్ల సూక్తుల పుస్తకాల ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 9: శరత్ సాహితీ కళా స్రవంతి, ఎస్‌ఆర్‌డీజి స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మధ్నాహ్నం జ్యోతీనగర్ ఎస్‌ఆర్‌డీజి స్కూల్‌లో యువ కవి, తెలుగు అధ్యాపకుడు పోరండ్ల రాజేశం రచించిన 'భావ తరంగాలు' కవితా సంపుటిని, 'పెరల్స్ ఆఫ్ విజడమ్' ఆంగ్ల సూక్తుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యావేత్త, ఎస్‌ఆర్‌డీజి స్కూల్ ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి, జాతీయ చిత్రకారుడు అబ్దుల్ మన్నాన్ సంస్థ అధ్యక్షుడు శరత్ సాహితీ, కళా స్రవంతి అధ్యక్షుడు సబ్బని లక్ష్మీనారాయణ, అన్నాడి గజేందర్‌రెడ్డి, పరశురామారావు తదితరులు పాల్గొన్నారు.

29 మందికి నియామక పత్రాలు అందజేత

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో తాత్కాలిక పద్ధతిన 29 మంది బదులు వర్కర్లకు మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం కార్యాలయంలో నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తూ అనారోగ్యానికి గురై చనిపోయినవారి కుటుంబాలకు సంబంధించిన కొంతమంది నియామక పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

కవ్వంపల్లి జ్యోతిర్మయి రాణికి డాక్టరేట్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజజ్యోతి): నగరంలోని 16వ డివిజన్ ఆనంద్ నగర్‌కు చెందిన కవ్వంపల్లి జ్యోతిర్మయి రాణికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గణితశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. 'సర్టెన్ ఫిక్స్ అండ్ కపుల్డ్ ఫిక్స్ పాయింట్ థీరమ్ ఇన్ వేరియస్ టైప్స్ ఆఫ్ మెట్రిక్ స్పేసెస్ విత్ అప్లికేషన్స్' అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ వి.నాగరాజు పర్యవేక్షణలో జ్యోతిర్మయి థీసిస్ సమర్పించారు. ప్రస్తుతం ఆమె నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పూలే జయంత్యుత్సవాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం సరికాదు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):మహాత్మా జ్యోతిబా పూలే జయంత్యుత్సవాల ఏర్పాట్లపై నిర్లక్ష్యం సరికాదని బీసీ సంఘం నాయకులు అన్నారు. పూలే జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 11వ తేదీన పూలే జయంత్యుత్సవాల సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ ఇప్పటి వరకు ఏర్పాట్లు చేయలేకపోవడం బాధాకరమన్నారు.

పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి


మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు

వీణవంక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెడ్డిపల్లిగ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ధరల పెరుగదలతో నిత్యావసరధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. పెట్రోల్‌ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి,నల్ల కొండాల్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: పెంచినధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం మండలకార్యదర్శి చెల్పూరిరాము అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ బీజేపీప్రభుత్వం పెంచుకుంటూ పోతోందన్నారు.

నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలి

చొప్పదండి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులనే విక్రయించాలని జిల్లావ్యవసాయ అధికారి జె భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం చొప్పదండిలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లసమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యాపారులు సీడ్, ఎరువుల, పురుగు మందుల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఎరువులను ఈపోస్ ద్వారా విక్రయించాలన్నారు.

రజతోత్సవానికి తరలిరావాలి

గంగాదర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమపార్టీ బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీఎమ్మెల్యే సుంకె రవి శంకర్ అన్నారు. బుధవారం గంగాధర శుభమస్తు ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సన్నాహకసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్కతుర్తిలో ఈనెల27న జరపతలపెట్టిన రజతోత్సవసభకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యుత్ ఉద్యోగులపై తేనెటీగల దాడి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లిలో బుధవారం విద్యుత్తు ఉద్యోగులు తాడికల్ ఫీడర్‌కు గ్రామం మీదుగా వెళ్తున్న 133/కేవీ విద్యుత్తులైనుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేశాయి. వెంటనేవారిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడినఉద్యోగులను డీఈ లక్ష్మరెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్‌గౌడ్, ఏఈ జనార్దన్ పరామర్శించారు.

కాంగ్రెస్ పార్టీతోనే భారత రాజ్యాంగ పరిరక్షణ

హుజూరాబాద్/వీణవంక/గన్నేరువరం/మానకొండూర్/భగత్‌నగర్/హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే భారత రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి, గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో, వీణవంక, గన్నేరువరంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా భారతరాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర బుధవారం నిర్వహించారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, లక్ష్మీపూర్‌లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల భద్రతకు భరోసా షీ టీం

● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతకు షీ టీం భరోసాగా నిలు స్తుందని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో షీటీం పోలీసులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను వేధిస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న వారు టీ సేఫ్ యాప్ వినియోగించాలని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీం 8712670759 నంబర్‌కు లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వలస పిల్లల కోసం కదిలిన అధికార యంత్రాంగం

● పాఠశాలలో చేరిన 63మంది విద్యార్థులు

రామడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీలలో మగ్గుతున్న 63 మంది చిన్నారులను అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఒరిస్సా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇటుక బట్టీలలో కార్మికులుగా పనిచేస్తున్న వలస కుటుంబాల పిల్లలను కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేల ద్వారా పిల్లలను గుర్తించిన అధికారులు మండలంలోని వెలిచాల పరిధిలోని గుడ్డేలుగులపల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో వేణుకుమార్ మాట్లాడుతూ విద్యద్వారానే మనిషి వికాసం సాధ్యమవుతుందన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, వెలిచాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేశ్, ఇటుకబట్టీల యజ మానులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఘన సన్మానం

గన్నేరువరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న నగేష్, మిత్ర హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎస్‌ఐ తాండ్ర నరేష్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాధాకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్

● మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ నిలుస్తున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 46మంది కల్యాణలక్ష్మి, 40మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన తాళ్ళపల్లి రవికుమార్‌ను కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నియమిస్తూ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి నియామక పత్రాన్ని రవికుమార్‌కు అందజేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు మెడల్స్

ఇల్లందకుంట/చొప్పదండి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట, చొప్పదండి మండలాల్లోని మోడల్‌స్కూల్ విద్యార్థులు వరుణ్‌తేజ్, శ్రీరుతిక్ కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. కరీంనగర్ అల్ఫోర్స్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో హమ్మింగ్‌బర్డ్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషనల్ క్లాసులను నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభచాటి మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ అయిలయ్య, హెచ్‌ఎం రాజిరెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

హుజూరాబాద్/వీణవంక/చొప్పదండి/గంగాదర/రామడుగు/ గన్నేరువరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవరెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. బుధవారం హుజూరాబాద్, వీణవంక, చొప్పదండి, గంగాధరలో పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశాలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేయాలన్నారు. రామడుగులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉప్పురాంకిషన్, గన్నేరువరంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగుభాస్కరాచారి పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక పండుగలు


పోచమ్మ బోనంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని ఇస్లాంపూర్‌లో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ, ఉప్పర మల్యాలలో నిర్వహించిన పోచమ్మ బోనాలలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నెత్తిన బోనంతో ఎమ్మెల్యే సత్యం గ్రామస్తులతో కలిసి ఆలయానికి వెళ్లారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, మాజీ ఎంపీటీసీ ముద్దం జమున నగేష్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీధర్

చిగురుమామిడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోకుండా ఉండేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మానకొండూరు డివిజన్ ఏడీఏ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో వరి పంటలను ఏవో రాజులనాయుడుతో కలిసి పరిశీలించారు. రైతులు వాతావరణశాఖ అందించే సూచనలు గమనిస్తూ అందుకు అనుగుణంగా కోతలు చేపట్టాలన్నారు. పూర్తిగా పరిపక్వతకు వచ్చాకనే వరి కోతలు మొదలుపెట్టాలన్నారు. రైతులకు ఏమైనా సమస్య ఏర్పడితే సంబంధిత ఏఈవోలను సంప్రదించాలన్నారు. వీరివెంట ఏఈవో ఫరీద్ తదితరులున్నారు.

అవీ..ఇవీ..

ఇల్లందకుంట: హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీని ఇల్లందకుంట ఆలయచైర్మన్ ఇంగిలే రామారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు బందోబస్తుకు కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీవాగ్దేవి డిగ్రీకళాశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం జరిగింది.విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్ స్టేషన్లో హుజూరాబాద్ రూరల్‌సీఐ పులి వెంకట్ మండల విద్యుత్ సిబ్బందికి రాగి వైర్ చోరీజరగకుండా ముందస్తు చర్యలో భాగంగా అవగాహన కల్పించారు.

-పిల్లల ప్రవర్తనను రోజువారి కార్యక్రమాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరిశీలించాలని హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ అన్నారు.

హుజూరాబాద్‌రూరల్: ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా విద్యార్థులు కష్టపడి చదవాలని మాజీఎమ్మెల్యే, కిట్స్‌కళాశాల సెక్రెటరీ వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

వీణవంక: మండలకేంద్రంలో మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి వర్ధంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు.

రామడుగు: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలో ఆమెమిషన్ భగీరథ అధికారులతో సమావేశమయ్యారు.

చిగురుమామిడి: బీఆర్‌ఎస్ మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నేడు మండలకేంద్రంలోని టీడీసీసీ బ్యాంకు పక్కనగల ఖాళీ స్థలంలో నిర్వహిస్తామని మండల అధ్యక్షుడు అంజయ్య తెలిపారు.

గణేశ్‌నగర్: విద్యుత్ ఉద్యోగులకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని గెస్ట్ హౌస్‌లో ఆదర్శ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎస్‌ఈ రమేష్ బాబు ప్రారంభించారు.

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల ఎదుట స్ఫూర్తి కుటుంబం తెలంగాణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమేశ్ బాబు ప్రారంభించారు.

కరీంనగర్ అర్బన్: ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి కరీంనగర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్ బిన్ మహ్మద్ నియామకమయ్యారు.